శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన పోలీసు క్వార్టర్స్

- నివాసయోగ్యంగా లేని భవనాలు..
- 50ఏళ్ల కిందట 128 ఫ్లాట్ల నిర్మాణం
- ప్రస్తుత 8కుటుంబాలు నివాసం
- భయాందోళనలో పోలీసు కుటుంబాలు
- నూతన క్వార్టర్స్ నిర్మించాలని వినతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో ఉన్న పోలీసు క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు ఐదు దశాబ్దాల కింద నిర్మించిన ఈ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతాయోనని పోలీసు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈభవనాలను కూల్చివేసి నూతన భవననిర్మాణాలు చేపట్టాలని కొన్నేళ్లుగా పోలీసు కుటుంబాలు చేస్తున్న విజ్ఞప్తిని పోలీసుబాస్‌లు పట్టించుకోకపోతుండటం గమనార్హం. నగరం మధ్యలో అత్యంత ఖరీదైన ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఈప్రాంతంలో తిరిగి పోలీసు క్వార్టర్లు నిర్మించాలని వారు పోలీసు కుటుంబాలు కోరుతున్నాయి.

8 బ్లాక్‌లుగా నిర్మాణం...

నగరంలో మొదటి పోలీసుస్టేషన్‌కు పిలువబడే వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో పోలీసు సిబ్బంది కోసం 1973లో ఈ క్వార్టర్స్‌ను పోలీసుశాఖ నిర్మించింది. మొత్తం ఎనిమిది బ్లాకులుగా క్వార్టర్లను నిర్మాణం చేశారు. ఒక్కో బ్లాకులో నాలుగు అంతస్తులు, ఒక్కో అంతస్తులో నాలుగు చొప్పున మొత్తం 128 ఫ్లాట్లు నిర్మించారు. ఈ క్వార్టర్స్‌లోకి నివాసం ఉండేందుకు పోలీసు సిబ్బంది కూడా ఎంతో ఉత్సాహాన్ని చూపించేవారు. అప్పట్నుంచి పోలీసు కుటుంబాలతో కళకళలాడిన ఈ క్వార్టర్లు, నిర్వహణ లోపం కారణంగా దశాబ్దకాలంగా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అప్పడప్పుడు శిథిలాలు కిందపడుతుండటంతో వీటిల్లో ఉండేందుకు సిబ్బంది భయపడి క్వార్టర్లను ఖాళీ చేస్తూ వచ్చారు.దీంతో ప్రస్తుతం కేవలం ఎనిమిది కుటుంబాలవారు మాత్రమే ఇక్కడ నివాసం ఉంటున్నారు.

కూటమి ప్రభుత్వ కుట్ర...

2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణం అంటూ హడావుడి చేసి తాత్కాలిక భవనాల కోసం ఈ స్థలాన్ని వినియోగించుకోవాలని చూసింది. అందులో భాగంగా ఈ స్థలంలో కొన్ని భవనాలను నిర్మాణం చేసి ప్రభుత్వ కార్యాలయాలుగా వినియోగించాలని కొంతమంది ఉన్నతాధికారులు ఆలోచన చేశారు. కాని కుదరలేదు. అయితే ఈ స్థలాన్ని ఇలాగా వదిలేస్తే ఇతరశాఖల అవసరాల కోసం వినియోగించుకునే అవకాశముందని పోలీసు వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

నూతన క్వార్టర్లు నిర్మించాలి...

2014లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నగరపాలకసంస్థ కార్యాలయం సమీపంలోని పోలీసు క్వార్టర్స్ కూల్చివేసి దానిని నేటివరకు ఖాళీగా ఉంచింది. అలాగే వన్‌టౌన్ స్టేషన్ ప్రాంగణంలోని క్వార్టర్స్ సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పోలీసు కుటుంబాలకు అవసరమైన స్థాయిలో క్వార్టర్స్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఇతర ప్రాంతాల్లో అద్దెకు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వన్‌టౌన్‌లో శిథిలావస్థకు చేరిన ఈ క్వార్టర్లను తొలగించి ఆస్థానంలో నూతన భవనాలను నిర్మించి పోలీసు కుటుంబాలకు అందించాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి. ఆదిశగా పోలీసు కమిషనరేట్ అధికారులు చొరవ చూపాలంటూ పోలీసు కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. లోక కళ్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహిస్తుంటారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్యనమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు సేవలో పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేడు వీఎంసీలో ప్రజా సమస్యలు - పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు - పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2లో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

వించిపేట(విజయవాడపశ్చిమ):రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్వర్ణకారుల సంఘం ఉపాధ్యక్షుడు షేక్ అమానుల్లా ఆధ్వర్యంలో ఆదివారం వించిపేట, నైజాంగేటు సెంటర్‌లో పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమానుల్లా మాట్లాడుతూ రంజాన్ మాసం అంటే దాన ధర్మాల మాసం అని పేర్కొన్నారు. ఎంత దానం చేస్తే అంతకు రెట్టింపు పుణ్యం లభిస్తుందని తెలిపారు. ప్రతి ముస్లిం ఉపవాస దీక్ష చేస్తూ నిజమైన పేదలను గుర్తించి వారికి దానధర్మాలు చేయాలనీ సూచించారు. రంజాన్ ప్రారంభం నుంచి ఏటా తన శక్తికొలది సహాయం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా 300 మంది పేదలకు రంజాన్ తోఫాను అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మార్కెట్ అవసరాలను గుర్తించి తదనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ సూచించారు. ఆ కళాశాల ఎంబీఏ ఫైనల్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పలు రకాల ఆటలు నిర్వహించి సందడి చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. కళాశాలలో సమపార్జించిన జ్ఞానాన్ని భవిష్యత్‌లో మార్గదర్శకం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్ మణికంఠ, అధ్యాపకులు ఎస్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకిన యువకుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణానదిలో దూకిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నంకు చెందిన మస్తాన్‌బీ కుమారులతో కలిసి నివసిస్తోంది. ఏడాది క్రితం సుభాని మిత్రుడు హుస్సేన్ అనే యువకుడు మృతి చెందాడు. దీంతో కలత చెందిన సుభాని అప్పటి నుంచి మానసికంగా కలతచెంది వింతగా ప్రవర్తిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు మూడు రోజుల తరువాత తిరిగి వస్తున్నాడు. ఈనేపథ్యంలో ఆదివారం మస్తాన్‌బీ బస్టాండ్ వద్ద ఉన్న తనచెల్లెలు వద్దకు కుమారుడు సుభానితో కలిసి వెళ్లింది. ప్రకాశం బ్యారేజీ వద్దకు రాగానే ఒక్కసారిగా తన ద్విచక్ర వాహనాన్ని పక్కన పెట్టి పరిగెత్తుకుంటూ కృష్ణానదిలో దూకేశాడు. వెంటనే మస్తాన్‌బీ అక్కడ స్థానికుల సాయంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారమందించింది. వారు నదిలో సుభాని కోసం వెతికినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో ఆమె ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్



రెజ్యూమో థెరపీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పటమట(విజయవాడ తూర్పు): అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్‌లో ప్రొస్టేట్ సమస్యలకు అందుబాటులోకి వచ్చిన విప్లవాత్మక చికిత్సా విధానం 'రెజ్యూమ్'ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్యూమ్ చికిత్సతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రశాంత్ హాస్పిటల్ చైర్మన్, యూరాలజిస్ట్ డాక్టర్ కే ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రెజ్యూమ్ థెరపీ ద్వారా నీటి ఆవిరిని ఉపయోగించి ప్రొస్టేట్ గడ్డలను తగ్గించడం ద్వారా, మూత్ర సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రశాంత్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కే ధీరజ్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ కే ప్రీతమ్, యూరో గైనకాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పీ హరిత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ అండ్ ఫీటల్ మెడిసిన్ ఎక్స్పర్ట్ డాక్టర్ శ్వేత సీవోవో బీ రమేష్, రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, కామినేని శ్రీనివాస్, సృజనా చౌదరి, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సామాజిక వికాసం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, సుజనాచౌదరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాహిత్యంతో సామాజిక వికాసం సాధ్యమని ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, సుజనాచౌదరి అన్నారు. ఉషా మాసపత్రిక- సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవలల పోటీల విజేతలకు కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో ఆదివారం బహుమతులు అందజేశారు. విజేతలైన రచయితలకు సుజనాచౌదరి, మండలి బుద్ధ ప్రసాద్ బహుమతులు అందజేశారు. రచయితలు సింహప్రసాద్ (ఊరేగింపు), ఏనుగంటి వేణుగోపాల్ (ఆముక్త మాల్యద), సలీమ్ (ఊరు లేనోళ్లు), చంద్రశేఖర్ ఆజాద్ (అవతార్) తదితరులకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమానికి మాసపత్రిక చీఫ్ ఎడిటర్ శరత్‌చంద్ర అధ్యక్షత వహించగా, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం తదితరులు ప్రసంగించారు. పత్రిక బాధ్యులు కట్టా రాంబాబు, ఆర్‌డీ విల్సన్, కళాశాల ఏవో డాక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అల్పాహార పంపిణీ



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న క్లబ్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పదోతరగతి విద్యార్థులకు వాసవి క్లబ్ భవానీపురం సభ్యుల సేవలు కొనసాగుతున్నాయి. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు వాసవీ క్లబ్ సభ్యులు ఫిబ్రవరి 10వతేదీ నుంచి ప్రతిరోజూ సాయంత్రం అల్పాహారం, పాలు పంపిణీ చేస్తున్నారు. అందులోభాగంగా ఆదివారం సాయంత్రం కూడా విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. పరీక్షలు ముగిసేవరకు ఈకార్యక్రమం కొనసాగుతుందని క్లబ్ సభ్యులు చెబుతున్నారు. అల్పాహార పంపిణీ కార్యక్రమానికి సమన్వయకర్తగా కోట హరికృష్ణ వ్యవహరిస్తున్నారు. వాసవి క్లబ్ భవానీపురం అధ్యక్షులు వీఎస్‌వీ కిరణ్‌కుమార్, కార్యదర్శి కె.శశికాంత్, కోశాధికారి జూపూడి చంద్రశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి వెంకట జయ నారాయణ, చుండూరు శ్రీధర్, ఆలమూరి సాంబశివ రావు, దేసు వెంకట శివప్రసాద్‌తోపాటు మిగిలిన సభ్యులు దాతలుగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమాన్ని డీఎస్ఎంసీ హైస్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్య, ఉపాధ్యాయులు కె.శివపార్వతి, కె.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తున్నారు.

అమ్మవారికి కళాకారిణుల నృత్య కళార్చన



కళావేదికపై నృత్యం చేస్తున్న కళాకారిణులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సకల కళలకు ఆరాధ్య దేవత అయిన ఆది పరాశక్తి జగన్మాత శ్రీకనకదుర్గ అమ్మవారికి కళాకారిణులు కైమోడ్పులతో నృత్య కళార్చన గావించారు. ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని కళావేదికపై నిర్వహించే ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా అమ్మవారి సన్నిధిలో ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయవాడకు చెందిన శ్రీనృత్య కళాశాల విద్యార్థినులు నృత్యాచార్య భాగవతుల శ్రీవల్లి నేతృత్వంలో పలు అంశాలకు నర్తించారు. గణపతి ప్రార్థనతో ప్రారంభించి 'జయ జయ నటరాజ' 'బ్రహ్మాంజలి', 'అయిగిరి నందిని', 'నగుమోము', 'అఖిలాండేశ్వరి' నృత్యాంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో భక్తులను అలరించి వారి హర్షధ్వానాలను అందుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు, కళాకారిణుల బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ధర్మోరక్షతి రక్షితః సంస్థ గౌరవాధ్యక్షులు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. భారత్ వికాస పరిషత్ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం కేబీఎన్ కళాశాల ఆవరణలోని లైబ్రరీ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాతీయ భావనను పెంపొందించుకోవాలన్నారు. భారత వికాస్ పరిషత్ చక్కని కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. సమాజంలో జాతీయ భావనలను పెంపొందించేందుకు కృషిచేస్తోందన్నారు. నూతన కార్యవర్గం మరింత విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు తేలప్రోలు వీరయ్యగుప్తా మాట్లాడుతూ సంస్థ నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం సంస్థ నిర్వహించిన కార్యక్రమాలకు సహకరించిన దాతలను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి ఎం దూరి వీరభద్ర రావు, కోశాధికారి కొత్తమాసు బ్రహ్మానందం, రాష్ట్ర నాయకుడు కమలానారాయణ తదితరులు ప్రసంగించారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య సమరయోదుడు సర్దార్ భగత్‌సింగ్ స్ఫూర్తిని నేటితరం కొనసాగించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు సూచించారు. డివైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక 52వ డివిజన్ మల్లికార్జునపేట సెంటర్‌లో ఆదివారం భగత్‌సింగ్ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు స్థానిక పెద్దలు భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి బ్రిటీష్ బానిస సంకెళ్లకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అటువంటి స్ఫూర్తిని నేటి తరం అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వీ సాంబశివరావు, ఆంజనేయులు, స్థానిక పెద్దలు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గానుగులకు ఉగాది పురస్కారం



యుగంధరాచార్యను పురస్కారంతో సత్కరిస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జ్యోతిష్యంలో విశేష కృషి చేసిన డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఉగాది పురస్కారం అందజేసింది. హోటల్ గోల్డెన్ వేలో విశ్వావసు ఉగాదిని పురస్కరించుకొని విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆదివారం జ్యోతిష సమ్మేళనం నిర్వహించింది. ఈ సమ్మేళనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సిద్ధాంతులు, జ్యోతిషులు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో గానుగుల యుగంధరాచార్యను ఉగాది పురస్కారం, జ్యోతిష జ్ఞాన రత్న పురస్కారంతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆదిపూడి శివసాయిరామ్, పాలపర్తి శ్రీకాంత్ శర్మ, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, విశ్వజ్యోతి సంస్థ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో నాణ్యత పెరగాలి



మాట్లాడుతున్న ఆచార్య సుధాకరరెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పరిశోధనల్లో నాణ్యత ప్రమాణాలు పెరగాలని ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత సంచాలకులు ఆచార్య సుధాకర రెడ్డి పేర్కొన్నారు. ఐసీఎస్ఎస్, కేబీఎన్ కళాశాల సంయుక్త నిర్వహణలో విద్యారంగంలో ఆధునిక పరిశోధన విధానాలపై యువపరిశోధకులకు ఏడురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకరరెడ్డి మాట్లాడుతూ అధునాతన పరిశోధనల్లో డేటా అనలిటిక్స్ ప్రధానభూమిక పోషిస్తోందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కన్సల్టెంట్ అకడమిక్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆచార్య కళ్ళే జాకబ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం 2020 పరిశోధనలకు పెద్దపీట వేసిందన్నారు. విద్యాబోధన, పరిశోధన రంగాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం పరిశోధన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర పరిశోధకులుగా మారాలన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి రిసోర్స్‌పర్సన్స్‌గా పాల్గొన్న ఆచార్యులు పరిశోధనాంశాల రూపకల్పన, డేటా సేకరణ పద్ధతులు ఉపయోగించి గణిత విశ్లేషణ, సాహిత్య చౌర్య నివారణ, గుణాత్మక పరిశోధన పద్ధతులు, నివేదిక రచన, పరిశోధనా పత్రాల ప్రచురణ అంశాలపై పరిశోధకులకు శిక్షణ ఇచ్చారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వీ నారాయణరావు వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, వర్క్‌షాప్ కన్వీనర్ కే శివప్రకాష్, కామర్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



కరాటే పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు

విజయవాడ స్పోర్ట్స్: కరాటే క్యూ లెవల్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్ డోజో, ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడ శివారు కొండపావులూరులోని ఎన్‌డీఆర్ఎఫ్ క్యాంపులో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఈ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షలో ఎన్‌డీఆర్ఎఫ్ డోజో విద్యార్థులు హర్షిత్ సింగ్, ఆరిషాఇస్లాం జూనియర్ రెడ్ బెల్ట్, గురుహర్షిణి ఆరెంజ్ బెల్ట్, వెంకటధావన్, హిమబిందు, బ్రహ్మతేజ్ గ్రీన్ బెల్ట్ సాధించగా ఎండీ ఆయాన్ జపాన్ బ్రౌన్ డిప్లొమో సాధించారు. ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు భువాన్ష్, జితార్థ్ జూనియర్ రెడ్ బెల్ట్, ప్రన్విత ఆరెంజ్ బెల్ట్, చయాంక్ ప్రద్యుమ్న బ్లూ బెల్ట్, ఆషిష్, స్నేహ జపాన్ బ్రౌన్ డిప్లొమో సాధించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎన్‌డీఆర్ఎఫ్ డెప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్ సింగ్, జపాన్ కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, ఇన్‌స్ట్రక్టర్ సాగరిక, ప్రకాశం జిల్లా ఇన్‌స్ట్రక్టర్ ప్రదీప్‌కుమార్ సర్టిఫికెట్లను అందజేశారు.

ముస్లిం వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం

హయాత్‌షరీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న హయాత్‌షరీఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): హజ్ యాత్రికులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం, దాన్ని ఎగవేసేందుకే కుట్ర పన్నిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు హయాత్ షరీఫ్ విమర్శించారు. అందులో భాగంగానే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్రం ద్వారా రద్దు చేయించిందన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల్లో ఏపీకి చెందిన హాజీలు అవస్థలు పడకూడదనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ తీసుకువచ్చారని గుర్తుచేశారు. అలాంటి సౌలభ్యాన్ని సీఎం చంద్రబాబు ఏపీ హజ్ కమిటీ చేత కేంద్రానికి లేఖ రాయించి రద్దు చేయించడం ద్వారా ముస్లిం మైనార్టీల ద్రోహిగా నిలిచారంటూ మండిపడ్డారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింల ప్రయోజనాలను కాపాడటంలో ఘోరంగా విఫలమయ్యిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యతిరేకించగా, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి ముస్లిం సమాజాన్ని మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వం ముస్లింలకు అందించిన ఎంబార్కేషన్ సదుపాయాన్ని కేంద్రం తొలగిస్తుంటే సీఎం చంద్రబాబు పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఏపీ నుంచి విమానయానశాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఉన్నప్పటికీ చోద్యం చూస్తుండటం బాధాకరమన్నారు. రాష్ట్రప్రభుత్వం అవలంభిస్తున్న ఇటువంటి ముస్లిం వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కె నజీర్, ఎస్‌కె ఇర్ఫాన్, రాంజానీ, సయ్యద్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ వద్ద మహాధర్నా : సీపీఎం



కబేళా ఇళ్లను సందర్శించిన బాబూరావు, సత్యబాబు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా రోడ్‌లో నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలోని ఫ్లాట్లను లబ్ధిదారులకు ఎప్పుడు కేటాయిస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కబేళా రోడ్‌లో నిరుపయోగంగా ఉన్న జీ ప్లస్ త్రి గృహసముదాయాన్ని పార్టీ పశ్చిమ కార్యదర్శి బోయి సత్యబాబు, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఇళ్ల కిటికీల అద్దాలు పగిలిపోయి తలుపులు దెబ్బతిని, పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తూ అధ్వాన్నస్థితిలో ఉన్న ఇళ్లను చూస్తుంటే బాధ కలుగుతోందన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పేదల కోసం నిర్మించిన ఈ గృహసముదాయం చివరికి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఇళ్ల అద్దెలు కట్టలేక పేదలు నానాఅవస్థలు పడుతుంటే లబ్ధిదారులు లేనట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని గొప్పలు చెప్పుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న ఇళ్లను నిరుపయోగంగా ఉంచడం దుర్మార్గమన్నారు. కబేళా వద్ద 300, అజిత్‌సింగ్‌నగర్‌లో 2వేల ఇళ్లు వృధాగా పడి ఉన్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేయించి అర్హులైన పేదవారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న పేదలకు ఇళ్లు ఇవ్వాలని, రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని, టిడ్కో గృహాలు వెంటనే అందించాలని కోరుతూ విజయవాడ కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు మస్తాన్, వెంకట్రావు, దుర్గారావు, అప్పన్న, రఫీ, దాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం లోక కల్యాణార్థం వేదపండితులచే హోమం జరిగింది. మహిళలు శ్రీ విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వార్షికోత్సవాల్లో పాల్గొని సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు పర్యవేక్షించారు.